# రోజులు కలిసివచ్చినా...

(కల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

మా బావమరిదిమనస్తత్వం నాకేమీ అంతుబట్టలేదు. ఎవడన్నా మనోవైజ్ఞానికుడు విడదీసి చెబితే బాగుండును.

మా బావమరిది ఉన్న ఊరు కదలనీ చేస్తున్న ఉద్యోగం మాననీ భీష్మించుక్కూచుని నెలకు అరవై రూపాయలు తెస్తూ పెళ్ళాం పిల్లల్ని పస్తులు పడుకోబెడుతూ ఏళ్ళు నెట్టాడు. వాడి దారిద్ర్యాన్ని ఎప్పుడైనా చూసేవాళ్ళకే ఎంతో బాధగా ఉండేది, వాడెల్లా భరించాడో.

తన దారిద్ర్యంతో అందరిదృష్టినీ ఆకర్షించానన్న సంతృప్తి వాడికే ఉంటుంటాను.

"ఈ దిక్కుమాలిన నౌకరీ మానేసి కాస్త పెద్ద బస్తీలకు పోయి నాలుగురాళ్ళు జాస్తి సంపాదించటానికి ఎందుకు ప్రయత్నించవురా?" అంటే, తనకు జీతం డబ్బులిచ్చే యజమాని అనవలసినమాటలు తానే అనేవాడు.

"నేను నిజంగా ఇంతకంటే ఎక్కువ జీతానికి అర్హుణ్ణయితే ఆ విషయం యజమానికి తెలిసివచ్చేటట్టు చేసి ఆయనహృదయపరివర్తన తెచ్చేభారం నామీద ఉన్నది. నా యజమాని హృదయపరివర్తన తీసుకురాలేకపోతే నాకు ఏ అర్హతా లేదన్నమాటే. మనం నైతికంగా మానవప్రకృతిని జయించాలిగాని ఏవూరుపోతే ఏముంది?"

ఈ వేదాంతంతో మా బావమరిది ఎల్లకాలమూ ఆఉద్యోగంలోనే ఉండిఉండును. కాని వాడి స్నేహితులు కొందరు చిన్న ఉద్యమం లేవదీసి వాడికి మూడు వందల రూపాయల ఉద్యోగం సంపాదించిపెట్టి, వాణ్ణి పట్నం ప్రయాణం కట్టించారు.

ఎట్లాగయితేనేం, మా చెల్లెలికీ దాని పిల్లలకూ కాస్త మంచిరోజులు వచ్చాయిగదా అనుకున్నాను. కిందటివారం పట్నం వెళ్ళి చూద్దామనుగదా, ఏం చెప్పను? వాడి సంగతి నానాభీభత్సంగా ఉంది. ఇల్లు అయ్యవారినట్టిల్లుగా ఉంది. ఎవరికీ ఏపూటా తిండి లేదు. మా చెల్లెలికీ పిల్లలకూ సరిగా బట్టలు లేవు.

నేను వెళ్ళేసరికి మా బావమరది అప్పుడే ఆఫీసుకు వెళ్ళిపోయినాడు. మా చెల్లెలు మాత్రమే ఇంట్లో ఉంది.

"నీకు పుణ్యం ఉంటుంది, హోటల్లో భోంచేసిరా. వచ్చేటప్పుడు ఏదన్నా టిఫిను తెచ్చిపెట్టు. పొద్దున్నే లేచి పచ్చిమంచినీళ్ళు తప్ప తాగలేదు. దగ్గిర డబ్బుంటే, నాలుగైదు రూపాయల్లో విల్లుచీర పట్రా. ఈ కట్టుకున్న పాత తప్ప మరొకటి లేదు," అన్నాది మా చెల్లెలు.

"ఇదేం, పాపకర్మ! వాడికి జీతం ఇవ్వరా?" అన్నాను.

"ఇస్తారు. ఏంలాభం? ఇరవై అయిదు వేలకు ఇన్సూరెన్సు తీసుకున్నారు. మా అందరి మరణానంతరం ఇరవై అయిదు వేలిస్తారట. ప్రస్తుతమటుకు నెలజీతంలో నూటఇరవై అయిదురూపాయలు పోతున్నాయి. కోఆపరేటివులో రెండువేలు అప్పు తీసుకుని ఒకటిన్నరగ్రౌండు నేల కొన్నారు. ఇన్సూరెన్సువాళ్ళిచ్చే డబ్బుతో దానిమీద ఇల్లుకడితే అందులో మా మునిమనమలు గృహప్రవేశమాతారుట. లేదా వాళ్ళు స్థలం అమ్ముకోదల్చుకుంటే అప్పటికి దాని ఖరీదు అయిదు వేలో పదివేలో అవుతుందిట. దానికింద నెలనెలా అరవయ్యో, డెబ్భయ్యో చెల్లూ! ఏ నెలా ఇంటిఅద్దె సరిగా ఇచ్చిన పాపానపోరు. ఇంటాయన వెళ్ళగొడతానని బెదిరిస్తున్నాడు. ఎవరో మొహమోటపెడితే లంచం లేకుండా ఇల్లిచ్చాడు. దానికి తగ్గట్టుగా అద్దెకూడా సరిగా ఇవ్వకపోతే ఆయన కెట్లా ఉంటుంది?" అన్నది మా చెల్లెలు.

నేనిదంతా నమ్మలేకపోయినాను. నలుగురు పిల్లల తల్లి మొగుడిమీద ఆపాటి ఒంటికాలితో పోకపోతుందా అనుకున్నాను.

సాయంకాలం మా బావమరిది ఆఫీసునుంచి తిరిగివస్తూ దాదాపు ఒకతాను పచ్చగుడ్డ తెచ్చాడు.

"నాకు చీర ఏమిటండీ?" అన్నది మా చెల్లెలు.

"చీర కొక్కడిదే డబ్బా! ఇది కర్టెన్లకోసం తెచ్చాను. ఏంరా, కాస్తఉద్యోగం చేస్తున్నామంటే జీవనప్రమాణం కాస్త పెంచుకోవాలా వద్దా? నువే చెప్పు," అన్నాడు.

మా చెల్లెలు చెప్పిన సంగతులన్నీ నిజమేనా అని అడిగాను. నిజమేనని ఒప్పుకున్నాడు.

"మన కిప్పుడు కొంత స్థాయిచిక్కింది కనక దీర్ఘకాలప్రణాళికలూ, నలుగురిలో కాస్త మర్యాదా సాధించాలి. ఏమంటావు? తిండికీ బట్టకూ లేకపోవటమనేది మనకు మొదటినుంచీ ఉండనే ఉన్నది. అట్లాగే నాలుగురోజులు గడుపుకుంటే ఆ తరవాత జంయిమని ఒక్క వెలుగు వెలగొచ్చు. ఈ కర్టెన్లు తగిలించినతరవాత చూసుకో, ఇల్లు ఎంత అందంగా ఉంటుందో! ఇదేం చూశావు, ఇన్‌స్టాల్మెంట్సుమీద మాంఛి రేడియోసెట్టొకటి మాట్లాడాను. రేపు తీసుకొస్తున్నాను," అన్నాడు మా బావమరిది.

నాకు నెత్తురుచూస్తే కళ్ళు ఖైరలు కమ్ముతాయిగాని లేకపోతే ఆ క్షణానే వాణ్ణి పిస్తోలుపెట్టి కాల్చిపారేసిఉండేవాణ్ణనుకోండి!


## తెలుగు మెఱుగులు

గ్రంథకర్త వేటూరి ప్రభాకరశాస్త్రి,

తెలుగుదనము, తెలుగు సంప్రదాయాలు తెలుగుభాష అవతరించిన విధము తెలుగు తేటదనము, తెలుగుకవితాపారమ్యము శాస్త్రి గారి పాతిక ముప్పయి సంవత్సరాల సాహిత్యకృషి ఇందులో మూర్తీభవించి యున్నది వెల రు 2/- తపాలాఖర్చులు 0-7-0